# 'బాబు పుట్టిన రోజు'

రచన శ్రీ మంత్రిప్రగడ వేంకటరమణారావుగారు

ఆ రోజు మా బాబు పుట్టినరోజు. మహాత్మా గాంధీకూడ ఆ తేదినే పుట్టాడు. అందుచేత బాబును ముద్దుగా 'గాంధీ' అని పిలుచుకుంటూ వున్నాం. ఇవేళతో వాడికి యేడాది వెళ్లి రెండోయేడు ప్రవేశించింది. అందుచేత మా ఆవిడ అలారం పెట్టుకుని నాలుగు గంటలకే లేచి నాకు వాడికి తలంటి నీళ్లుపోసింది. కొత్తబట్టలు యిచ్చింది. బాబుకు పౌడరుపూసి బొట్టుపెట్టి అన్నపూర్ణ వాణ్ణి నాదగ్గర విడిచిపెట్టి వంటప్రయత్నము చేయసాగింది. ఆదివారం కావడంవల్ల నేను యిల్లు విడిచిపెట్టి యెక్కడికీ వెళ్లనవసరం లేక పోయింది. మా యింటావిడ ఆరోజు సంవత్సరాది పండగ నాటికంటె యెక్కువ రుచ్యమైన పదార్థాలు తలపెట్టింది.

అన్నపూర్ణకు కాపురానికివచ్చిన రెండేళ్లదాకా పిల్లలంటే మక్కువలేదు. ఎవరి పిల్లలయినా యేడ్చినా, అల్లరిపెట్టినా విసుక్కునేది. అయితే ఆడుతూ, పాడుతూ వచ్చీరాని మాటలు మాట్లాడుతుంటే నలుగురితోపాటు ఆమెకీ సంతోషమే! కాని స్వతహాగా పిల్లలు కావాలని కాంక్షలేదు. ఆమె స్వభావం అటువంటిది. కాని దైవవశాత్తు బాబు పుట్టడంవల్ల ఆమెకు పిల్లలమీద విముఖత పోయింది. వాడి పనిఅంటే ఆవిడకు విసుగనే మాటేలేదు. బాబు సంరక్షణ విషయంలో అపరిమితమయిన శ్రద్ధ యిదే నాకు ఆశ్చర్యం కల్గిస్తూంటుందీ యిప్పటికూడా!

ఈ రోజు రెండు తీపి, రెండు కారాలూ కూడా చెయ్యాలని ఆమె సంకల్పం. మా భార్యాభర్తలిద్దరికి హోళిగలంటే చాలా యిష్టం. అయితే అవి ఎన్నిసార్లు చెయ్యబోయినా ఆవిడకు ఒహాపట్టాన కుదరవు. తక్కిన పదార్థాల విషయంలో మాలో మాకు ఏమీ పేచీలేదు. ఆవిడ హోళిగలు చేస్తానన్నప్పుడు నేనుమాత్రం 'కాద'నకుండా వుండలేకపోయాను. యిదివరకు కుదరనప్పుడల్లా నెయ్యి మంచిది కాదనో గోధుమపిండి కల్తీఅనో, లేక పప్పు ముక్కదనో నెపం తనమీదలేకుండా సర్దుకునేది. యీసారి కొందరిదయవల్ల అన్ని వస్తువులు శుభ్రమైనవే మరి! అయితే మాత్రం నాసందేహం తీరలేదు. ఆఖరికి—

'ఇష్టం మాట దేవుడెఱుగు! నీకు ఓపట్టాన కుదరవు. మానేయ'మన్నాను. ఆవిడ వినలేదు సరే యివాళ యీ "పత్తిపని"పెట్టుకుని రెండుగంటల్దాకా కనీసం యిగరేస్తుందని నిస్పృహచేసుకుని వూరుకున్నాను.

అన్నీ అమరించుకుని, ఆవిడ ఘడికట్టేసరికి సరిగ్గా గడియారం పదికొట్టింది. సర్వం సిద్ధంగా వున్నాయి కాబట్టి మామూలుగా వండుకునే పదార్థాలన్నీ ఒక్క గంటలో పూర్తయాయి. యింక స్పెషల్సు చెయ్యటానికి వుపక్రమించింది. ఇంతవరకూ మాబాబుగాణ్ణి పట్టడానికి పడ్డపాట్లు యిన్నీ అన్నీ కావు. తలప్రాణం తోకకువచ్చిదంటే నమ్మండి.

వాడు ఒక్కక్షణం నాదగ్గర వుండడు. వట్టి దుడుకు చెయ్యి. కాలువచ్చినవాడు కట్టేస్తే వుంటాడా! యిల్లంతా తిరిగిగాలించి క్రిందివిమీదు, మీదివి క్రిందుచెయ్యాలని వాడి వుబలాటం. అదీగాక గంటనుంచి తల్లి యెదుట లేక పోవడంతో ఏడుపుమొహంపెట్టి, క్రమంగా హెచ్చుస్థాయిలోకి దించాడు. ఏం చెయ్యను! యేడుపు మానేట్టు లేదు. యీ యేడ్పు మా గృహలక్ష్మి చెవినిపడి,

'యేమండీ! ఆమాత్రం పసిపిల్లాణ్ణి సముదాయించకపోతే పనులెల్లా అవుతాయనుకున్నారు' అని మృదువుగానే అరిచింది.

అందులో మంవాడు యేదన్నా పట్టుకుంటే వదలడు. బంక నక్కరకాయన్నా నయం వాడికి గోడనున్న 'గాంధీ పటం' కనిపించింది. అది కావాలని వేలు చూపించాడు. మాఆవిడ యెప్పుడన్నా వాణ్ణి సముదాయించ వలసివస్తే ఆబొమ్మ చూపించి 'అదిగో తాత! గాంధి తాత' అంటూ వుంటుంది అది జ్ఞాపకం వచ్చిందేమో కావాలంటున్నాడు. పిల్లలకి తాతంటే యెంత సరదా! తప్పని సరిగా కాస్త 'యేడుపుమాని కూర్చుంటాడేమోనని' యిచ్చాను. వాడు

ఆ పటంతో ' తాత ! తాత ' అంటూ ఆడుతూ కుర్చీదగ్గిర కూర్చున్నాను. కొంత విరామం దొరికిందికదా అని అప్పుడే వచ్చిన పత్రిక బల్లమీంచి అందుకొని తిరగేస్తున్నా రెండు మూడు కాలములు చదివానో లేదో లోపల్నుంచి గృహిణి,

'ఏమండోయ్ ! ఒక్కసారి యిలా రావాలి ' అని కేక వేసింది నాలుగోసారి పిలిచాక నా చెవినిపడింది తీరావెళ్ళి చూస్తే వంటింట్లో బాబ బొబ్బట్లు దొంతర చేతపుచ్చుకుని నోట్లో కుక్కుకుంటున్నాడు. మా ఆవిడ నిల్చుని నవ్వుతోంది. వాడు మా నవ్వుచూసి తెల్లబోయి చూస్తున్నాడు గాంధీ పటంనిండా పూర్ణపుముద్ద పులిమిపెట్టాడు.

'ఏమే ! అన్నా ! వాణ్ణిమారంగాతీసి కాసిని మంచినీళ్లు పట్టు 'అన్నా

'చాల్లేస్తురూ ! కొంచెం చూడమంటే అలావిడిచిపెట్టేశారు. నేను చూడనేలేదు. పొయ్యి విసురుతూంటే చల్లగా పిల్లిలాగ ఎప్పుడొచ్చాడో వెనకనించి ' అంది అర్ధాంగి.

'నేను మాత్రం చూశానా ఏమిటి? పేపరు చూస్తూంటే ఎలక పిల్లలాగ ఎప్పుడు జారాడో !' నే నన్నాను.

'అంతే బచ్చలుకుబదులు యిప్పుడు చేసినవన్నీ అలావుండ క్రిందచేస్తే, మళ్ళీ ఎప్పుడుచెయ్యాలి నేను ' అని నిట్టూర్చింది.

' యింక చాలించి, వడ్డన ప్రయత్నం చూడు. తరువాయి వుంటే సాయంత్రంలోగా తీరికగా కానివచ్చు. వాడి పుట్టిన రోజు కనుక వాడి ఎంగిలి ప్రసాదమే మనకున్నూ. మరేమీ లోపంలేదు ' అని సర్ది చెప్పాక భోజనాలకు లేచాము. భోజనం అయి లేచేసరికి పన్నెండు కొట్టింది.

అప్పటినుంచి అన్నపూర్ణ పెద్ద యెత్తున పిండి వంటలు చెయ్యటం మానుకుంది నాకు పిల్లవాణ్ణి సముదాయించే బాధ్యత సగం తీరింది.

★


# రీటా హెయిర్ టానిక్

## తల వెంట్రుకలను పెంచును



రీటా కురుళ్లకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్

తల వెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేను కొరుకు, ఇంకను తల వెంట్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును వేనకువేలు వాడి గుణమును పొంది యున్నారు మీరుకూడ నేటినుండియే రీటా వాడుడు రీటా హిందూ దేశమంతటా దొరకును

వెల సీసా 15 అణాలు.

**RITA**

**HAIR TONIC**

